



18న పాలకొండలో మినీ జాబ్ మేళా

ప్రజాశక్తి - పార్వతీపురం

పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 18న మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా టెన్త్, ఇంటర్, డిగ్రీ చదువుకుని 18 - 28 ఏళ్ల నిరుద్యోగ యువతీ యువకులు జాబ్ మేళాకు అర్హులని చెప్పారు. అర్హత కలిగిన యువత బుధవారం ఉదయం 9గంటలకు పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించు జాబ్ మేళాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కావున ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను https://naipunyam.ap.gov.in వెబ్ సైట్ నందు నమోదు చేసుకోవాలని వివరించారు. మరిన్ని వివరాలకు 63012 75511 మొబైల్ నెంబరును సంప్రదించవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వాడకం తక్కువ...బిల్లులు ఎక్కువ



పెనుభారంతో వినియోగదారుల అవస్థలు
మరోవైపు విజిలెన్స్ కేసులతో బెంబేలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర ధరలతోపాటు విద్యుత్తు బిల్లులు ధరలు పెరగడంతో ప్రజలపై పెను భారం పడి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. పెరుగుతున్న విద్యుత్ బిల్లులతో పాటు మరో వైపు విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు గ్రామాల్లో పర్యటించి అదనపు విద్యుత్ లోడ్లు పేరిట అపరాధ రుసుములు భారీగా ప్రజలకు తెలియకుండా విధించడంపై గగ్గోలు పెడుతున్నారు.

ప్రజాశక్తి - కొమరాడ

కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఫ్యూయ అండ్ పవర్ పర్చేజీ కాస్ట్ అడ్జెస్ట్ మెంట్ (ఎఫ్ పిపిపిసిఎ) పేరుతో విధించిన ఛార్జీలు ప్రజలకు తడిసిమోపుడవుతున్నాయి. వైసిపి హయాంలో ట్రూఅప్, ఎపిపిపిపిసిఎ వంటి రూపాల్లో విధించిన బిల్లుల భారం ఇప్పటికీ కొనసాగుతోంది. తాజాగా టిడిపి ప్రభుత్వం నవంబరు నుంచే ఎఫ్‌పిపిపిసిఎ ఛార్జీలను వినియోగదారులపై మోపింది. వీటికితోడు సర్‌ఛార్జీలు, ఫిక్స్, కస్టమర్ ఛార్జీలు ఇలా రకరకాల పేర్లతో విధించిన ఛార్జీలతో వస్తున్న బిల్లులను చూసి వినియోగదారుల గుండెగుభేల్మంటోంది. మండలంలో అత్యధికంగా గృహ వినియోగదారులే ఉన్నారు. గృహ వినియోగానికి అంతంత మాత్రంగా విద్యుత్ వినియోగిస్తుంటే వేలల్లో బిల్లులు వస్తున్నాయి. దీంతో బిల్లులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అర్తాం గ్రామానికి చెందిన కె.లక్ష్మికి నవంబర్‌లో 87 యూనిట్లు విద్యుత్ వాడకానికి రూ.368 వచ్చింది. డిసెంబర్ నెలలో 67 విద్యుత్ యూనిట్ల వాడకానికి రూ.328 రావడంపై ఆందోళన చెందుతున్నారు. 20 యూనిట్లు వాడకం తగ్గినప్పటికీ దాదాపు గత నెల అంత విద్యుత్ బిల్లులు రావడంపై ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇలా గ్రామంలోని ప్రతి వినియోగదారునికి బిల్లుల భారం పడింది. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న వేసవిలో వినియోగం పెరిగితే విద్యుత్ బిల్లుల భారం ఏ మేరకు పెరుగుతోందనని ఇప్పటి నుంచే భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఓవర్‌లోడ్ పేరిట వడ్డన

ఒకవైపు పెరుగుతున్న విద్యుత్ ఛార్జీలను చెల్లించలేక అవస్థలుపడుతున్న వినియోగదారులకు మరోవైపున విజిలెన్స్ అధికారులు ఓవర్‌లోడ్ పేరిట అధికంగా జరిమానాలు వేస్తున్నారు. శ్రీకాకుళం నుంచి విజిలెన్స్ అధికారులమని గ్రామాలకు వచ్చిన విజిలెన్స్ అధికారులు విద్యుత్ వినియోగం కలెక్షన్లపై తనిఖీలు చేపడుతున్నారు. అంతవరకు సక్రమంగా ఉన్నప్పటికీ ప్రతి ఇంటికీ వెళ్లి ఇంట్లో ఉన్న వస్తువుల వివరాలు సేకరించి వినియోగదారులకు ఎటువంటి విషయం చెప్పకుండానే తనిఖీలకు వచ్చామని చెప్పుకునేందుకు ఉన్నతాధికారులకు చెప్పాలని చెప్పి వారి నుంచి సంతకాలు సేకరిస్తున్నారు. సంతకాలు తీసుకుని వెళ్లిన నెలరోజుల తర్వాత స్థానిక విద్యుత్ లైన్‌మాన్, సిబ్బంది వచ్చి మీ ఇంటికి అదనంగా విద్యుత్ లోడ్ కట్టుకోవాలని గతంలో విజిలెన్స్ అధికారులు వచ్చి మీకు ఫైన్లు వేసి వెళ్లారని సిబ్బంది తెలిపారు. విద్యుత్ కలెక్షన్ లోడ్ కెపాసిటీని పెంచుకునేందుకు రూ.5 వేలు నుంచి రూ.10 వేలు వరకు అపరాధ రుసుం విధించడంపై వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మూడు లైట్లు, ఫ్యాన్ కు రూ .35 వేలు బిల్లు

మండలంలోని కెమిశీల పంచాయతీ నాయుడువలసలో 123230 సి 151000016 సర్వేనెంబర్ గల మీటర్‌కు మూడు లైట్లు, ఫ్యాన్ ఉన్నప్పటికీ రూ.35వేలు బిల్లు రావడంతో లబ్ధిదారులు గోగ్లుగోలు పెట్టారు. గ్రామానికి చెందిన పొట్నూరు లక్ష్మనాయుడు ఇంటికి పాత మీటర్ ఉన్నప్పటికీ జూన్‌లో వంద రూపాయలు బిల్లు వచ్చింది. అనంతరం విద్యుత్ శాఖ అధికారులు కొత్త డిజిటల్ మీటర్ను ఏర్పాటు చేశారు. అనంతరం జులైలో పాత మీటర్‌పై వాడిన బిల్లు 119 రూపాయలతో వచ్చింది. అనంతరం జులైలో మీటర్ బిల్లు తీయ్యగ రూ.32వేలకు పైగా బిల్లు రావడంతో ఒక్కసారిగా లబ్ధిదారుడు షాకు గురయ్యాడు. అప్పట్లో ఈ విషయంపై విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు స్పందించడం లేదు. దీంతో ప్రతి నెలా బిల్లు పెరుగుతూ దాదాపు రూ.36 వేలు పైగా చేరుకొంది. స్థానికుల సహాయంతో ఈ విషయం ఫిర్యాదు చేస్తే బిల్లు కట్టాలని విద్యుత్ శాఖ అధికారులు తేల్చి చెప్పారు. దీంతో లక్ష్మనాయుడు కుమారుడు మనోజ్ విద్యుత్ శాఖ డిఇని రిజిస్టర్ పోస్టు ద్వారా ఫిర్యాదు పంపిస్తే డిఇ బిల్లు మొత్తంలో సగం అంటే రూ .16వేలు చెల్లించాలని ఉచిత సలహా ఇచ్చారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు చేసిన తప్పిదాలకు వినియోగదారులను బలిచేయడం ఎంత వరకు సమజంసమని ప్రశ్నిస్తున్నారు.

అధికారుల తప్పిదంతో తప్పని ఇబ్బందులు



విద్యుత్ శాఖ అధికారులు ఉన్న పాత మీటర్ను తీసి కొత్త మీటర్ వేయడంతో తమకు ఒక్కసారిగా రూ.32 వేలు విద్యుత్ బిల్లు రావడంపై తీవ్ర ఆందోళన కలిగించింది. ఈ విషయమై అధికారులు ఫిర్యాదు చేస్తే కచ్చితంగా డబ్బులు కట్టాలని చెప్పడం చాలా అన్యాయం. పెండింగ్ ఉన్న బిల్లు కడితేనే విద్యుత్ సరఫరా ఇస్తామని తన ఇంటికి విద్యుత్తు కలెక్షన్ను అధికారులు నిలిపివేశారు. ప్రతి నెలా రూ.200లోపు వచ్చే విద్యుత్ బిల్లు రూ.32వేలు వస్తే ఎలా కట్టాలి. అధికారులు స్పందించి తన ఇంటికి విద్యుత్ సరఫరాను యధావిధిగా కొనసాగించాలి.

పొట్నూరు లక్ష్మీనాయుడు,
నాయుడువలస.

పెరిగిన విద్యుత్ బిల్లులతో కుటుంబ పోషణ కష్టం



విద్యుత్ ఛార్జీల పెంపు వల్ల నాలాంటి కార్మికులకు ఇబ్బందులు తప్పడం లేదు. దుకాణాల అద్దెలు కట్టుకొని పనులు చేస్తుంటే, మరోవైపు భారీగా విద్యుత్ బిల్లులు పెద్దమొత్తంలో రావడం దారుణం. ప్రస్తుతం పనులు కూడా అంతగా లేకపోవడంతో కుటుంబ జీవనమే కష్టంగా మారింది. దీనికి తోడు పెరుగుతున్న విద్యుత్ బిల్లులు మరింత తమను కృంగదీస్తున్నాయి. ప్రభుత్వాలు స్పందించి పెరుగుతున్న విద్యుత్ ఛార్జీలను నిలుపుదల చేసి తక్కువ ధరకే విద్యుత్ సరఫరాను చేస్తే ఉపయోగకరం.

వై .అప్పలనాయుడు,
వెల్డింగ్ షాప్, జంఝావతి



పొట్టిశ్రీరాములుకు నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

భాషాప్రయుక్త రాష్ట్రాలకు కారణభూతుడు పొట్టి శ్రీరాములు

- ఉక్కుమనిషి వల్లభాయ్ పటేల్
- వర్ధంతి కార్యక్రమంలో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి - పార్వతీపురం

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ కొనియాడారు. భారతదేశపు ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ అని కలెక్టర్ కొనియాడారు. ఆదివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పొట్టి శ్రీరాములు, పటేల్ వర్ధంతి కార్యక్రమం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వారి చిత్ర పటాలకు కలెక్టర్ పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగుభాషకు కొత్త అర్ధం చెప్పిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములని అన్నారు. తెలుగు వారికి ఒక ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆత్మార్పణ చేసిన పొట్టి శ్రీరాముల త్యాగాన్ని వెలకట్టలేమని అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ ఆశయాల కొరకు జీవితాంతం కృషిచేసిన మహనీయుడని పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధనకు ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించి, అమరజీవియైన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు వర్ధంతి ప్రతి ఏటాడిసెంబర్ 15న నిర్వహిస్తూ, స్మరించుకోవడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు.

భారతదేశపు ఉక్కు మనిషిగా సర్దార్ వల్లభభాయ్ పటేల్ పేరుగాంచారని, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడిగానే కాకుండా స్వాతంత్ర్య అనంతరం హైదరాబాదు, జునాగఢ్ లాంటి సంస్థానాలు దేశంలో విలీనం చేసిన ఘనత పటేల్‌కే దక్కుతుందన్నారు. భారత రాజ్యాంగ రచనలో ప్రముఖ పాత్ర వహించారని, స్వాతంత్ర్య అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలోని కేంద్ర మంత్రి మండలిలో హోంశాఖ మంత్రిగానూ, ఉప ప్రధానిగా బాధ్యతలు నిర్వహించారని పేర్కొన్నారు. ఆయన సేవలకు గుర్తుగా భారత ప్రభుత్వం భారతరత్న బిరుదును ప్రకటించిందని వివరించారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.హేమలత, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి ఎస్.కృష్ణ, కలెక్టరేట్ లోని వివిధ విభాగాల పర్యవేక్షకులు జి.శ్రీరామమూర్తి, సిహెచ్.రాధాకష్ణ, కలెక్టరేట్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొని నివాళులు అర్పించి, వారి సేవలను స్మరించుకున్నారు.

ఐటిడిఎలో....

అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం స్ఫూర్తిదాయకమని ఐటిడిఎ ఎపిఒ ఎ.మురళీధర్ అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఐటిడిఎ గిరిమిత్ర సమావేశం మందిరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ప్రధాన కారణం పొట్టి శ్రీరాములు అన్నారు. శ్రీరాములు స్ఫూర్తి అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని ఆయన అడుగుజాడల్లో నడవటం అత్యవసరమని అన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి వై.సత్యంనాయుడు, ఐటిడిఎ ఎఒ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కంబరలో రైతు సదస్సు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కంబరలో సోమవారం రైతు సదస్సు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ ఆదివారం ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

నిందితుల గుర్తింపులో తాత్సారం

మొక్కుబడిగా కేసు నమోదు పట్ల సర్వత్రా విమర్శలు

ప్రజాశక్తి - పాలకొండ

నీటిసంఘాల ఎన్నికల్లో మండలంలో పణుకువలస టీసీ ఎన్నికకు సంబంధించి నవగాం పాఠశాలలో ఎన్నిక జరుగుతుండగా ఏకంగా పాఠశాల లోపలికు చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు ఎన్నికల సామాగ్రి దొంగలించుకుపోవడం చర్చనీయంశమైంది. సాక్ష్యాత్తు సబ్ కలెక్టర్ వెంటనే అక్కడకు చేరుకొని జరిగిన విషయంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పోలీసుల పనితీరు మీద ఆగ్రహం వ్యక్తం చేశారు. 144 సెక్షన్ అమలులో ఉన్నప్పుడు ఇలాంటి సంఘటన జరగడం ఏమిటని పోలీసులను ప్రశ్నించారు. వెంటనే కేసు నమోదు చేయమని ఆదేశిస్తే, చేతులు దులుపుకునే ప్రయత్నాలు పోలీసులు మొదలెట్టారు. మొక్కుబడిగా కేసు నమోదు చేసి, నిందితులను ఇంతవరకు గుర్తించలేదు. దీనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరు ఈ సామాగ్రి తీసుకుని వెళ్లారు అనేది అందరికీ తెలిసినప్పటికీ, మొక్కుబడిగా దర్యాప్తు చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. చిన్న నేరం జరిగితేనే హడావిడి చేసే పోలీసులు, ఈ స్థాయిలో కేసు నమోదు జరిగినా, చోద్యం చూడటం పట్ల తీవ్ర విమర్శలు వినిపిస్తుంది. దీనిపై ఇప్పటికైనా పోలీస్ అధికారులు చర్యలు వేగవంతం చేసి నిందితులను పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రేపు జాతీయ పెన్షన్‌దారుల దినోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని బెలగాం రైతు బజార్ వెనుక ఉన్న రిటైర్డ్ ప్రభుత్వ పింఛనుదారుల సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 10 గంటలకు జాతీయ పింఛనుదారుల దినోత్సవం నిర్వహించనున్నట్టు రిటైర్డ్ ప్రభుత్వ పింఛనుదారుల అసోసియేషన్ కార్యదర్శి డి.గణపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో 75 ఏళ్ళ నిండిన పింఛనుదారులను సన్మానిస్తామన్నారు. కావున రిటైర్డ్ ప్రభుత్వ పింఛనుదారులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విఆర్ఎస్ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని మామిడిపల్లిలో వెంగళరాయసాగర్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న భూముల్లో యధేచ్ఛగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. సబ్ డివిజన్ అధికారులు, ఉద్యోగుల సమ్మతితోనే కొంతమంది వ్యాపారులు ఇష్టారాజ్యంగా రోడ్డు పక్కన విఆర్ఎస్ స్థలాల్లో షాపులు నిర్మిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత కొంత కాలంగా ఇదే వ్యవహారం కొనసాగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే విఆర్ఎస్‌కు చెందిన భూములు కొంతవరకు అన్యాక్రాంతమయ్యాయి. అయినా అధికారుల్లో చలనంలేదు. విఆర్ఎస్ క్వార్టర్స్‌కు చెందిన బోరు నుంచి సమీపంలో ఉన్న దుకాణాలకు నీరు కూడా సరఫరా చేస్తూ వారి నుంచి సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. సబ్ డివిజన్ కార్యాలయంలో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులు రోజూ విధినిర్వహణలో భాగంగా ఇక్కడికి రాకపోవడంతో ఇందుకు సంబంధించిన స్థలాల ఆక్రమణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. విలువైన విఆర్ఎస్ భూముల ఆక్రమణపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.




ఇరిగేషన్ స్థలంలో వెలసిన దుకాణాలు

మెండంగి రహదారికి మోక్షం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని పనసభద్ర పంచాయతీ పరిధిలో మెండంగి కొండశిఖర గ్రామానికి దుగ్గేరు నుంచి వెళ్లే రహదారి పనులు పూర్తయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర చొరవతో సుమారు రెండు కిలోమీటర్ల 300 మీటర్ల రహదారికి సుమారు రూ.కోటీ 20 లక్షలు నిధులు రహదారి పనులు పూర్తి చేయాలని అప్పట్లో ప్రతిపాదించారు. గత ప్రభుత్వం ఆఖరు కాలంలో కొంతమేర రహదారు పనులు చేపట్టారు. అయితే అప్పట్లో బిల్లులు రానందువల్ల రహదారి పనులు మధ్యలో ఆగిపోయాయి. అనంతరం కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పెండింగ్‌లో ఉన్న నిధులు మంజూరు చేయడంతో ఈ రహదారి పనులు పూర్తికావచ్చాయి. అయితే కొన్నిచోట్ల రహదారికి ఇరువైపులా వేయాల్సిన షోల్డర్స్ పంట భూములను నేపథ్యంలో అలాగే అక్కడ మట్టిదొరకపోవడంతో ఇరువైపులా షోల్డర్లు వేయకపోవడంతో ఆ ప్రాంతం ప్రమాదకరంగా మారింది. అలాగే సుమారు 300 మీటర్ల వరకు గతంలో వేసిన సిసి రోడ్డు అయింది. అయితే ఈ ప్రాంతంలో సిమెంటు రహదారి నిర్మాణానికి నిధులు చాలడంలేదని కాంట్రాక్టర్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఉన్న నిధులతో 1900 మీటర్ల బిటి రోడ్డు నిర్మాణం చేపట్టామని తెలిపారు. వేరే ప్రాంతం నుంచి గ్రావెల్ తెచ్చి వదిలేసిన షోల్డర్‌ను పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

మధ్యలో వదిలేసిన సిసి రోడ్లు



మెండంగి నుంచి దుగ్గేరు వరకు నిర్మించిన రోడ్డు



శిథిలమైన ఆడారుగెడ్డపై గల కాజ్‌వే

వంతెన మంజూరు చేయాలి

మెండంగి -దుగ్గేరు మధ్య ఉన్న అడారు గెడ్డపై వంతెన మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని ఈ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు. బ్రిడ్జి నిర్మించకపోవడం వల్ల కోట్లాది రూపాయలతో వేసిన రహదారులకు ప్రయోజనం ఏం కలుగుతుందని వారు అంటున్నారు. గతంలో నిర్మించిన కాజ్‌వే పూర్తిగా దెబ్బతిందని, దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని, వర్షాకాలంలో మరింత ప్రమాదకరంగా తయారైందని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు ఆడారుపై వంతెన నిర్మిస్తే సాలూరు-మక్కువ మండలాలకు చెందిన సుమారు 25 గిరిజన గ్రామాలకు ఉపయోగకరంగా ఉంటుందని వారు అంటున్నారు. వెంటనే నిర్మాణం కూడా చేపట్టాలని కోరుతున్నారు .

శతశాతం ఫలితాల కోసమే వందరోజుల ప్రణాళిక

నెలాఖరుకు పదోతరగతి సిలబస్ పూర్తి ● 'ప్రజాశక్తి'తో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతినాయుడు ముఖాముఖి

జిల్లాలో వందశాతం ఫలితాల కోసమే పదోతరగతి విద్యార్థులకు వందరోజుల ప్రణాళిక అమలు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి నల్ల తిరుపతినాయుడు చెప్పారు. ఈనెలాఖరు నాటికి పదోతరగతి సిలబస్ పూర్తవుతుందని తెలిపారు. 'ప్రజాశక్తి'తో ఆయన ముఖాముఖి మాట్లాడారు.

- ప్రజాశక్తి, పార్వతీపురం



పదోతరగతిలో మెరుగైన ఫలితాల కోసం చేపడుతున్న చర్యలు ఏమిటి?


జిల్లాలో నవంబర్ 9 నుంచి పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. తర్వాత ఎస్‌సిఇఆర్‌టి మార్గదర్శకాల మేరకు వందరోజుల ప్రణాళిక అమలు చేస్తున్నాం

వందరోజుల ప్రణాళిక ప్రధాన లక్ష్యం ఏమిటి?

మెరుగైన ఫలితాల కోసమే వందరోజుల ప్రణాళిక అమలు చేస్తున్నాం. ప్రధానంగా తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. ఏఏ సబ్జెక్టుల్లో విద్యార్థులు వెనుకబడి ఉన్నారో తెలుసుకుని ఆ సబ్జెక్ట్ ఉపాధ్యాయులతో తర్ఫీదు ఇస్తున్నాం. ప్రతి రోజూ పరీక్షలు నిర్వహిస్తున్నాం. అదే క్రమంలో సబ్జెక్టుల వారీగా అనుమానాలు ఉంటే సంబంధిత ఉపాధ్యాయులతో నివృత్తి చేయిస్తున్నాం.

జిల్లాలో వందరోజుల ప్రణాళిక ఎలా అమలవుతోంది?

ప్రస్తుతం జిల్లాలో సమ్మేటివ్-1 పరీక్షలు జరుగుతున్నాయి. ఈనెల 20 నుంచి వందరోజుల ప్రణాళిక అమలు చేయనున్నాం. ఇటీవల ఆర్‌జెడి పర్యటనలో భాగంగా సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులకు ఎలా తర్ఫీదు ఇవ్వాలనేది చెప్పారు. తదనుగుణంగా పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5వరకు ఒక సబ్జెక్టుపై చదివించి సాయంత్రం 4 నుంచి 5 వరకు ఆ సబ్జెక్ట్‌పై పరీక్ష నిర్వహిస్తాం.



వందరోజుల ప్రణాళిక ఎప్పటి నుంచి అమలు చేస్తున్నారు?

డిసెంబర్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 10 వరకు వందరోజుల ప్రణాళిక అమలు చేస్తున్నాం.

ఈ ప్రణాళిక అమలు లో వసతిగృహాల విద్యార్థులకు ఇబ్బందులేమైనా ఉన్నాయా?

లేదు. వసతి గృహ విద్యార్థులకు కూడా సెలవు రోజుల్లో స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం

పదోతరగతి సిలబస్ ఎప్పటికి పూర్తవుతుంది?

ఈనెలాఖరు నాటికి పదోతరగతి సిలబస్ పూర్తవుతుంది. ఇప్పటికే కొన్ని సబ్జెక్టుల్లో సిలబస్ పూర్తయింది. అన్ని సబ్జెక్టులు నెలాఖరుకు పూర్తవుతుంది.

జిల్లాలో ఎంతమంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాస్తున్నారు?

జిల్లాలో 10,434 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాస్తున్నారు.



ఘంటసాల విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న మంత్రి సంధ్యారాణి

ఘనంగా ఘంటసాల ఆరాధనోత్సవాలు

ప్రజాశక్తి - సాలూరు

అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు మధుర గీతాలాపన కోసం ఆదివారం పట్టణంలో ఉన్న రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఘంటసాల ఆరాధనోత్సవాలు నిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జి.సంధ్యారాణి ఈ ఉత్సవాలకు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఘంటసాల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఘంటసాల పాటలు వీనుల విందుగా ఉంటాయ న్నారు. ఏటా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం గర్వకారణమని చెప్పారు. రాష్ట్రం నలుమూలల నుంచి వర్ధమాన గాయకులు ఈ ఉత్సవాల్లో పాల్గొని రాత్రి పది గంటల వరకు ఘంటసాల పాటలను ఆలాపిస్తారు. ఈ కార్యక్రమంలో కబీర్ షా ఆర్కెస్ట్రా నిర్వాహకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ జర్జాపు ఈశ్వరరావు, జనసేన నాయకులు జర్జాపు సూరిబాబు, వ్యాపారవేత్త మండవిల్లి వెంకటేశ్వరరావు, పట్టణ, మండల టిడిపి అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, ఆముదాల పరమేష్ పాల్గొన్నారు.

రేషన్ వాహనం ద్వారా సరుకులు అందజేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

రేషన్ వాహనం ద్వారా 18రకాల నిత్యవసర వస్తువులు అందజేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు లక్ష్మయ్య డిమాండ్ చేశారు. క్రిస్మస్, సంక్రాంతి కానుకలు గతంలో మాదిరిగా పేద ప్రజలకు అందించాలని కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన రేషన్ వాహనం ద్వారా బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారన్నారు. ఇకపై కేరళ మాదిరిగా 18 రకాల నిత్యవసర సరుకులు అందజేయాలని కోరారు.



పడవలో విహారం చేస్తున్న పర్యాటకులు

పార్కులో సండే సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. పార్కులోని అందాలను ఆశ్వాదించడానికి పర్యాటకులు కుటుంబాలతో వచ్చి అందాలను కనువిందు చేసుకున్నారు. జల విహార్ వద్ద హాయిహాయిగా బోటు షికారు చేశారు. యువతీ యువకులు హ్యాంగింగ్ బ్రిడ్జి, నీటిపై నడిచి వెళ్తూ ఆనందం పొందారు. స్పేస్ సైకిల్ ఎక్కి ఆకాశంలో ఒక తీగపై తొక్కుతూ చక్కెర్లు కొట్టారు. మరి కొంతమంది యువకులు సాహస క్రీడలతో సాహించారు. ఆనంద విహార్ వద్ద కేరింతలు కొడుతూ ఉల్లాసంగా, ఉత్సాహంగా డాన్సులు వేశారు. చిన్నారుల మినీ బోటింగ్ మినీ ట్రైన్ ఎక్కి సరదాగా గడిపారు. ఆడలి యు పాయింట్ సందర్శించి మైమరిపిస్తే ప్రకృతి అందాలను తిలకించారు. అనంతరం మెట్టు గూడ జలపాతాన్ని సందర్శించి జలకాలాడారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తతో ఉండాలని స్థానిక ఎఎస్ఐ లంక శ్రీనివాసరావు అన్నారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంటిపేటలో సైబర్ నేరాలపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలియని వ్యక్తుల నుంచి లింకులు పంపిస్తే ఓపెన్ చేయవద్ధని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఆన్లైన్ మోసాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ క్రైమ్, ఆన్లైన్ మోసాలపై వివరించారు. కార్యక్రమంలోకానిస్టేబుల్ జయలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.



పార్వతీపురంలో కురిసిన పొంగమంచు

కురుస్తోన్న మంచు.... ఇబ్బందుల్లో ప్రజలు

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

పట్టణంలో గత మూడు రోజులుగా చలి తీవ్రత ఎక్కువవుతుంది. ఉదయం 7 గంటలు దాటినా మంచు కురుస్తుండడంతో ఇళ్లలో నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు ఆసక్తి చూపించడం లేదు. పలు పనులపై బయటకు వచ్చే వాహన చోదకులు వాహనాల లైట్లు వేసుకొని రాకపోకలు సాగించే పరిస్థితి వస్తోంది. ఒకపక్క అధిక చలి, మరొకపక్క మంచు ఎక్కువగా కురుస్తుండడంతో చిన్నారులు, గర్భిణీలు, వృద్ధులు శ్వాస కోసం వ్యాధులు ఉన్న వారు ఇబ్బందులు పడుతున్నారు. పనులపై బయటకు వచ్చే సమయంలో చలి , మంచు ప్రభావం నుండి తట్టుకునేందుకు రక్షణ దుస్తులను ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు..

మరుగుదొడ్లు వాడుకలోకి తేవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక పట్టణ రైల్వే స్టేషన్‌లో గల మరుగుదొడ్లను రైల్వే అధికారులు వాడుకలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణ రైల్వే స్టేషన్లో గల మరుగుదొడ్ల గదులకు తాళం వేసి ఉంచడం వల్ల ప్రయాణికులతో పాటు, మహిళలు చాలా ఇబ్బంది పడుతున్నారని, మరుగు దొడ్లు గదులకు వేసిన తాళాలు తీసి ప్రజలుకు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.



తాళాలు వేసిన ఉన్న మరుగుదొడ్లు

మహనీయుడు పొట్టి శ్రీరాములు

మంత్రి ఘనంగా నివాళి

ప్రజాశక్తి - సాలూరురూరల్

తెలుగు వారి స్వేచ్ఛకోసం ప్రత్యేక రాష్ట్రం ఉండాలని కోరుకొని తన ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా పట్టణంలో గల ఆయన విగ్రహానికి ఆదివారం ఆమె పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలుగు ప్రజలకు రాజకీయంగా, వ్యాపార పరంగా దేశంలో ఎక్కడా గుర్తింపు లేదని, అసలు తెలుగు వారుగా చెప్పుకోవడానికి కూడా వెనుకంజ వేసే వారని, తెలుగు వారిని మదారసి అని అనే పిలేచే వారని ఉమ్మడి మదరాసు రాష్ట్రంలో తెలుగు వారు ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారని వివరించారు. తెలుగు వారికి ఒక ప్రత్యేక రాష్ట్రం ఉండాలని ఎన్నో పోరాటాలు చేసినా అప్పటి పెద్దలు కనీసం పట్టించుకునేవారు కాదన్నారు. దీన్ని చూసి చలించిన పొట్టి శ్రీరాములు తెలుగు జాతికి ఒక ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ దీక్ష చేపట్టారు. ఆయన మరణం తరువాత ఆంధ్ర ప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేశారన్నారు. ఆయనకు గుర్తింపుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్ దేవ్, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణి, పట్టణ, మండల టిడిపి అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, అముదాల పరమేష్, ఆర్య వైశ్యలు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

సాలూరు: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. తన నివాసం లో జరిగిన కార్యక్రమంలో ఆయన పొట్టి శ్రీరాములు సేవలను కొనియాడారు. రాష్ట్ర అవతరణ కోసం ఆయన చేసిన ప్రాణత్యాగం ఎప్పటికీ మరువలేనిదని చెప్పారు. శ్రీబాగ్ ఒప్పందంలో భాగంగా కర్నూలులో రాష్ట్ర హైకోర్టు ఏర్పాటు చేయాలని ఉందని, అయితే టిడిపి ప్రభుత్వం కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామనడం ఆ ఒప్పందానికి విరుద్ధంగా వుందన్నారు. కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, మాజీ కౌన్సిలర్లు తాడ్డి శంకరరావు,ఎం.అప్పారావు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

సీతానగరం : మండలంలోని పెదబోగిలి కార్యాలయం వద్ద గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్య వైశ్య సంఘ నాయకులు కూర్మదాసు లక్ష్మణరావు, కె.శ్రీనివాసరావు, గణేష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. అలాగే మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఎంఇఒ జి.సూర్యదేవుడు, జూనియర్ అసిస్టెంట్ రామనాయుడు, ఇన్చార్జి ఇఒ రమేష్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు ఎంతో త్యాగం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ తేరిజమ్మ, గరికయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు రమేష్, శ్రీనివాసరావు, రాజు పాల్గొన్నారు.

బలిజిపేట : మండలంలోని పెదపెంకిలోని నేతాజీ గ్రంథాలయం వద్ద పొట్టి శ్రీరాములు వర్ధంతి జరిగింది. గ్రంథాలయ స్థాపకులు ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యం శ్రీరాములు చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం మహా నీయుడ్ని స్మరించి కొనియాడారు. కార్యక్రమంలో మాజీ జవాన్ ఆనందరావు, గంట సాధు, గంట సింహాచలం, పొందూరు మురళి, మామడి శంకరరావు, ఆచారి, కోట శ్రీను, కర్రి శంకర్, గొర్రెల శ్రావణ్, కోట గౌరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతి ఐటిడిఎలో ఘనంగా నిర్వహించారు. శ్రీరాములు చిత్రపటానికి ఐటిడిఎ డిప్యూటీ ఇఒ పి.నారాయుడు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అమరజీవి స్ఫూర్తిగా ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎఎంఒ పి.కోటి బాబు, సిబ్బంది సత్యారావు, రాధాకష్ణ, సత్యనారాయణ, త్రినాధరావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : ఆంధ్ర రాష్ట్ర అవతరణలో పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని మున్సపల్ ప్రజారోగ్య విభాగ అధికారి కె. పకీరు రాజు అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ప్రజారోగ్య విభాగం సిబ్బందితో కలిసి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావం కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు.



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి సంధ్యారాణి

పార్వతీపురం రూరల్ : భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు మూలకారకుడైన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య సంఘం నాయకులు డి సీతారాం ఆధ్వర్యంలో ఆదివారం వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో పొట్టి శ్రీరాములుకు నివాళ్లు అర్పించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, అనంతరం ఆయన రాష్ట్ర సాధనకు చేసిన కృషి, త్యాగం గురించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కె.సత్యనారాయణ, నాగేశ్వరరావు, గాంధీ తదితరులు పాల్గొన్నారు.



బలిజిపేటలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న సంజీవనాయుడు

ఐవిఎఫ్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మెట్రోపాలిటన్ నగరాలకు ధీటుగా పట్టణంలో ఐవిఎఫ్ సెంటర్ ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. పట్టణంలో జయశ్రీ హాస్పిటల్ సంస్థ వైద్యులు యాళ్ల వివేక్, యాళ్ల పద్మజ సౌజన్యంతో పద్మశ్రీ థియేటర్ పక్కనే వారి కుమారులైన డాక్టర్ ధీరజ్, దీపక్ వంశీ, కోడలు రాణి రోజా ఆధ్వర్యాన కొత్తగా ఏర్పాటు చేసిన కుటుంబ్ ఐవిఎఫ్ సెంటర్(సంతాన సాఫల్య కేంద్రం)ను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు నియోజకవర్గ ప్రాంత ప్రజల సౌకర్యార్థం మెట్రోపాలిటన్ నగరాలకు ధీటుగా ఐవిఎఫ్ సెంటర్ ఏర్పాటు చేయడం ఆనందదాయకమని అన్నారు. సంతానలేమి ఉన్న దంపతులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఈ ప్రాంతంలోని మంచి వైద్యం అందించి, ఉత్తమ ఫలితాలను సాధించేలా కృషి చేయాలని అన్నారు. అనంతరం డాక్టర్లకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులతో, భాస్కర విద్యాసంస్థల చైర్మన్ చుక్క భాస్కరరావుతో, పాటు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



ఐవిఎఫ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

రహదారి పనులతో గ్రామస్తుల హర్షం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని కె.ములగ నుంచి డోకిశీల వరకు బిటి రహదారి పనులు పూర్తి కావడంతో గ్రామీణుల్లో ఆనందం నెలకొంది. పదులకొద్దీ గిరిజన గ్రామాలకు ఎంతో సౌకర్యంగా ఉండే ఈ రహదారి గత కొన్నేళ్లుగా పూర్తిగా చిద్రమై శిథిలావస్థకు చేరుకోవడంతో గుంతలలో ప్రయాణించి గిరిజనులు పార్వతీపురం పట్టణానికి చేరుకోవడానికి నానా అవస్థలు పడాల్సి వచ్చేది. అయితే గత ప్రభుత్వంలో ఈ రహదారి పనులకు నిధులు కేటాయించినప్పటికీ కాంట్రాక్టర్ ఎవరూ ముందుకు రాకపోవడంతో పనులు కొనసాగలేదు. ఎన్నిసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు వెనకడుగు వేయడంతో వాయిదాలు పడుతూ వచ్చేది. అయితే టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర చొరవతో కాంట్రాక్టర్లను ఒప్పించి పనులు ప్రారంభించడంతో రహదారి నిర్మాణం పూర్తి అయ్యాయి. ఎన్నో ఏళ్లుగా అవస్థలు పడుతున్న తమకు ఇక ప్రయాణం సాఫీగా సాగుతుందని పలు గ్రామాలు ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ట్రైకార్ సభ్యురాలు లావణ్య

'రబ్బరు సాగు రైతులను ఆదుకుంటాం'

ప్రజాశక్తి - కురుపాం

రబ్బర్ సాగు చేస్తున్న రైతులను ఆదుకుంటామని ట్రైకార్ బోర్డు మెంబర్ పువ్వల లావణ్య అన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ట్రైకార్ బోర్డు చైర్మన్ శ్రీనివాసరావుతో కలిసి రాష్ట్రంలో ఉన్న ఐటిడిఎలన్నీ సందర్శించామని తెలిపారు. అందులో భాగంగా రంపచోడవరంలో గల మారేడుమిల్లిలో గిరిజన రైతులు సాగు చేస్తున్న రబ్బర్ తోటను సందర్శించామని, వారు ఎదుర్కొంటున్న సమస్యలు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. వారికి రబ్బరు ప్రాసెసింగ్ యూనిట్, స్మోక్ సాంబర్, రోలింగ్ మిషన్లు అవసరమని తెలియజేశారని, వాటిపై తమ బోర్డులో చర్చించి సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి అందేలా చేస్తామని అన్నారు. అలాగే ఈ రబ్బరు మీద ఎక్కువ ఆధారపడి ఉన్నారని వారు ఆరోగ్యం కూడా పాడు చేసుకుంటున్నారని కావున వారిక చిరుధాన్యాలు సాగుపై అవగాహన కల్పించి ఐటిడిఎ ద్వారా విత్తనాలు అందేలా చేస్తూ వారిని ఆర్థికంగా అభివృద్ధి చేస్తూ, ఆరోగ్యంగా ఉండేలా కృషి చేస్తామని లావణ్య తెలిపారు.

ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) ఆవరణలో ఆదివారం 1998-1999 పదో తరగతి పూర్వ విద్యార్థులు కలుసుకోవడంతో పాఠశాలలో పండగ వాతావరణం నెలకొంది. ఎక్కడెక్కడో ఉన్న వారంతా ఒకచోటికి చేరుకొని ఎలా ఉన్నావ్... ఏం చేస్తున్నావ్ అంటూ ఒకరికి ఒకరు సంతోషంగా పలకరించుకొని ఆత్మీయంగా అలింగనం చేసుకున్నారు.. ఈ సందర్భంగా పాఠశాలకు బీరువాలు, కుర్చీలు, మైదాన ప్రాంతంలో విద్యుత్ దీపాల అలంకరణ ఏర్పాటు చేశారు. చదివిన చదువులమ్మ తల్లిని మర్చిపోకుండా తమ రుణం తీర్చుకున్నామని వారన్నారు. అదేవిధంగా గురువులకు ఘనంగా సన్మానించారు.

సూర్యపీఠంలో దత్తాత్రేయ ప్రత్యేక మంత్రహోమాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ శివారులో గల శ్రీ సూర్యపీఠంలో ఆదివారం దత్త జయంతి సందర్భంగా ప్రత్యేక మంత్రహోమాలు జరిగాయి. భానువార ప్రయుక్త ఆదిత్య పంచాయతన సౌరదీక్షలో దత్తాత్రేయునికి స్వర్ణ కమలార్చన, దత్త అథర్వశీర్ష, మహాసుదర్శన మంత్రహోమాలు ప్రధాన యాగశాల లో జరిగాయి. బ్రహ్మశ్రీ వేమకోటి నరహరిశాస్త్రి ఆశీస్సులతో వేమకోటి వివేకానంద్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా జా.సూ.శర్మ, ఆర్.కే.శర్మలు పాల్గొన్నారు..

సిఐను అభినందించిన ఎస్‌పి

ప్రజాశక్తి- బొబ్బిలి

జాతీయ లోక్ అదాలత్‌లో 438 కేసులను రాజీ చేపించిన పట్టణ సిఐ కె.సతీష్ కుమార్‌ను జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ అభినందించారు. స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఐపిసి కేసులు 59, పెట్టి కేసులు 379 రాజీ చేయడంతో జిల్లాలో అత్యధికంగా బొబ్బిలి పోలీసు స్టేషన్ నుంచి రాజీ అయ్యాయి. దీంతో సిఐ సతీష్ కుమార్‌ను ఆయన అభినందించారు.

ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి - సీతంపేట

ద్విచక్ర వాహనాలు నడిపితే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై వై.అమ్మనరావు అన్నారు. మండలంలోని గుణిని జంక్షన్ వద్ద వాహనదారులకు, యువతకు రోడ్డు ప్రమాదాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డుపైకి ద్విచక్ర వాహనం వస్తే తప్పనిసరిగా హెల్మెట్ తోనే రావాలని అవగాహన కల్పించారు. శిరస్త్రం లేకుండా వాహనం నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు భద్రతలో భాగంగ రహదారి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనం నడిపితే కేసులు తప్పవని హెచ్చరించారు. హెల్మెట్‌తో పాటు సి బుక్, లైసెన్స్, ఇన్సూరెన్స్ పొల్యూషన్ వాహనాల ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. మితిమీరి వేగంతో వెళ్లరాదన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ సంజీవ్, హెచ్‌సి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని ఎస్ఐ పి.నారాయణరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రానికి సమీపంలో గల మూలి గూడ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్రువపత్రాల్లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. అనంతరం మద్యం సేవించి, హెల్మెట్, సీటు బెల్ట్ లేకుండా వాహనాలు నడపడం వల్ల కలిగే అనార్థాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలంలోని గొట్టివలస సమీపంలో ఆదివారం స్థానిక ఎస్ఐ పి.రమేష్ నాయుడు వాహనదారులు కు హెల్మెట్ వాడకంపై అవగాహన నిర్వహించారు. ప్రతి వాహనదారుడు తప్పకుండా మోటార్ వెహికల్ నిబంధనలు పాటించాలని, పరిమితి వేగంతో ప్రయాణించాలని, మలుపులు వద్ద హారన్ వినియోగం తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు. అలాగే ద్విచక్ర వాహనదారులు ట్రిపుల్ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు సంఘటనలు ఎక్కువగా ఉన్నాయని, కావున వాహనదారులు నిబంధనలు పాటించి ప్రయాణం చేయడం వల్ల సుఖప్రదంగా, క్షమంగా ఇళ్లకు చేరవచ్చున్నారు. హెల్మెట్ ప్రతి ద్విచక్ర వాహనదారుడు ధరించాలని, చట్టాలు చాలా తీవ్రంగా ఉన్నాయని సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




కురుపాంలో వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నారాయణరావు

హెల్త్ అసిస్టెంట్లను కొనసాగించాల్సిందే

యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం కోట

వైద్య ఆరోగ్య శాఖలో హెల్త్ అసిస్టెంట్ల (పురుష ఆరోగ్య కార్యకర్తలు) ను తొలగించడం అన్యాయమని, వారందరినీ కొనసాగిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక జెడ్‌పి ప్రాంగణంలోని మినిస్టీరియల్ భవనంలో యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యాన జెవి ప్రసాద్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ఏనాటికైనా రెగ్యులర్ చేస్తారన్న ఆశతో ఎదురుచూస్తూ, అరకొర వేతనాలతో 22 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. అరకొర వేతనాలు సైతం సరిగా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు. హెల్త్ అసిస్టెంట్లను తొలగించారని తెలియగానే గుంటూరులో కొల్లి లక్ష్మణరావు, తూర్పుగోదావరి జిల్లాలో ఉద్యోగం కోల్పోయిన హెల్త్‌అసిస్టెంట్ ఒవిఎం నెహ్రూ తండ్రి ఒగ్గు ఆశీర్వాదం గుండెపోటుతో మరణించారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ చర్య వల్ల సంభవించిన రెండు మరణాలకు ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు బాధ్యత వహించి, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి, ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్‌చేశారు. తొలగించిన హెల్త్ అసిస్టెంట్లను కొనసాగించాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి జివిఎన్ఎస్ఎన్ మూర్తి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని రౌండ్‌టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. రౌండ్ టేబుల్ సమావేశంలో టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు టిబిఎస్ వర్మ, ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు కంది వెంకట రమణ, ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు ఎ.కనకరాజు, ఫార్మాసిస్ట్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బివి ప్రసాద్, గవర్నమెంట్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు టి.శ్రీధర్‌బాబు, సీనియర్ ఎఎన్ఎంల సంఘం నాయకులు డి.పద్మావతి, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి, ఎపిఎస్ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.రాములు, రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల జెఎసి రాష్ట్ర కో-చైర్మన్ బి.కాంతారావు, 108 ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వి.అప్పలనాయుడు, కంటింజెంట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి.దుర్గారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.అప్పలసూరి, వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్టు ఉద్యోగుల విభాగం నాయకులు జి.కృష్ణారావు పాల్గొన్నారు.



నీటిసంఘాల చైర్మన్లను అభినందిస్తున్న మండల టిడిపి అధ్యక్షులు వేణుగోపాలనాయుడు

నీటి సంఘాల చైర్మన్లకు అభినందనలు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలో శనివారం జరిగిన ఏడు మీడియం ఇరిగేషన్, నాలుగు ఇరిగేషన్ ఆయకట్టు సంఘాల ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన చైర్మన్లు టిసి సభ్యులకు మండల టిడిపి అధ్యక్షులు గుల్ల వేణుగోపాలరావు నాయుడు అభినందనలు తెలిపారు. ఆదివారం ఎ.వెంకంపేటలోని తన స్వగృహానికి వచ్చిన వారందర్నీ ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి - సాలూరు

పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డు దుగ్దసాగరం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని పట్టణ సిఐ బి.అప్పలనాయుడు చెప్పారు. కుడి చేయికి సంబంధించిన అరచేయి లేకుండా వుందని, అతని వయసు 45 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. ఆయన దగ్గర ఉన్న సంచిలో ప్లాస్టిక్ వస్తువులు, గాజు సీసాలు ఉన్నాయని సిఐ అప్పలనాయుడు చెప్పారు.



రోడ్డుపక్కనున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం